వరంగల్ వాయిస్

Evening Daily

www.warangalvoice.net

వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 211 గురువారం | 22 ఫిబ్రవరి 2024 | పేజీలు : 10 | వెల రూ. 5




## జాతీయ హెూదా అంటూ ఉండదు

- జాతీయ స్థాయి గుర్తింపునకు చర్యలు
- మేడారం పర్యటనలో కిషన్ రెడ్డి వ్యాఖ్యలు

10లో

వివరాలు లోపలి పేజీలలో..



# వనం వీడి.. జనంలోకి

- గద్దెను చేరిన సమ్మక్క
- అద్భుత ఘట్టాన్ని తిలకించేందుకు పోటీ పడిన భక్తులు
- కొలువుదీరిన వనదేవతలు సమ్మక్క, సారలమ్మ, గోవిందరాజు, పగిడిద్దరాజు
- జనసంద్రంగా మారిన మేడారం

తెలంగాణ కుంభమేళాగా చెప్పుకునే మేడారంలో కీలక ఘట్టం ఆవిష్కృతమైంది. వన దేవత సమ్మక్క తల్లి వనం వీడి జనంలోకి వచ్చింది. అమ్మ గద్దెపైకి చేరే అద్భుతాన్ని కనులారా వీక్షించిన భక్తకోటి పరవశించిపోయారు. సమ్మక్క తల్లి గద్దెల వద్దకు చేరుకోవడంతో కాసేపు దర్శనాలు నిలిపివేశారు. పూజారులు సంప్రదాయబద్ధంగా ప్రత్యేక పూజలు చేసిన అనంతరం దర్శనాలు యథావిధిగా కొనసాగాయి. దీంతో వనదేవతలు సమ్మక్క, సారలమ్మ, గోవిందరాజు, పగిడిద్దరాజు మేడారం గద్దెలపై కొలువుదీరినట్లయింది. తల్లులను తనివితీరా చూసేందుకు జనం తండోపతండాలుగా తరలి వచ్చారు. జాతర సందర్భంగా ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం ఇప్పుడు జనసంద్రంగా మారింది. మొక్కులు, దర్శనం కోసం వచ్చే భక్తులతో మేడారం పరిసరాలు పూర్తిగా నిండిపోయాయి. భక్తులు మొక్కులు సమర్పించుకునేలా శుక్ర, శని వారాలు వనదేవతలు గద్దెలపైనే ఉంటారు. శనివారం సాయంత్రం దేవతల వన ప్రవేశంతో జాతర ముగుస్తుంది.

- వరంగల్ వాయిస్, మేడారం





## రేపు మేడారానికి సీఎం రేవంత్

### భారీగా ఏర్పాట్లు చేసిన అధికారులు

అతి పెద్ద గిరిజన కుంభమేళ మేడారం జాతరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం రానున్నారు. మధ్యాహ్నం 12గంటల ప్రాంతంలో జిల్లా ఇంచార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితోపాటు ఇతర మంత్రులతో కలిసి ఆయన సమ్మక్క, సారలమ్మలను దర్శించుకోనున్నారు. అదే విధంగా ఉదయం 10 గంటలకు రాష్ట్ర గవర్నర్ తమిళిసై మేడారం సమ్మక్క సారలమ్మలను దర్శించుకొని మొక్కులు చెల్లించుకోనున్నారు. గవర్నర్ మేడారం ఇది మూడోసారి. కేంద్ర ట్రైబల్ వెల్ఫేర్ మంత్రి అర్జున్ ముండా కూడా శుక్రవారమే అమ్మవార్లను దర్శించుకోనున్నారు. ప్రముఖుల రాక సందర్భంగా పోలీసులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు.

- వరంగల్ వాయిస్, హైదరాబాద్



చిలకల గుట్ట నుండి బయలుదేరిన సమ్మక్క తల్లి, గాలిలోకి కాల్పులు జరిపి తల్లికి స్వాగతం పలికిన ఎస్పీ శబరిష్

# వనం వీడి.. జనంలోకి



### గద్దెను చేరిన సమ్మక్క

### అద్భుత ఘట్టాన్ని తిలకించేందుకు పోటీ పడిన భక్తులు

### కొలువుదీరిన వనదేవతలు సమ్మక్క, సారలమ్మ, గోవిందరాజు, పగిడిద్దరాజు

### జనసంద్రంగా మారిన మేడారం

**వరంగల్ వాయిస్, మేడారం :** ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని మేడారం ఇప్పుడు జనసంద్రంగా మారింది. ఎటు చూసినా కిలో మీటర్ల మేర జన జాతర కనిపిస్తోంది. మొక్కులు, దర్శనం కోసం వచ్చే భక్తులతో మేడారం పరిసరాలు పూర్తిగా నిండిపోయాయి. భక్తుల కొంగు బంగారంగా వెలుగొందుతున్న మేడారం సమ్మక్క, సారలమ్మ జాతర రెండేళ్లకోసాని మాఘశుద్ధ పౌర్ణమిన పూర్తి గిరిజన సంప్రదాయాలతో అంగరంగ వైభవంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. గురువారం సాయంత్రం సమ్మక్క తల్లిని చిలకలగుట్టనుంచి గద్దెలకు తీసుకొచ్చే ఘట్టం మహాద్భుతంగా ఉంటుంది. ఆమె వస్తున్న క్షణాలు అక్కడ ఉద్విగ్న వాతావరణం నెలకొంటుంది. దేవత రాకను సూచిస్తూ డప్పులు, శంఖం ధ్వనులతో అడవి ప్రతిధ్వనించింది. సమ్మక్క, సారలమ్మ నామ స్మరణతో పరిసర ప్రాంతాలు మార్మోగాయి. శివసత్తుల పూనకాలు, భక్తుల మొక్కులతో మేడారం పులకించగా ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడింది. వనదేవతలను దర్శించుకునేందుకు తెలుగు రాష్ట్రాలతోపాటు పొరుగున ఉన్న మహారాష్ట్ర, ఛత్తీస్ గఢ్, ఒడిశా నుంచి లక్షలాదిగా భక్తులు తరలివస్తున్నారు. దీంతో మేడారం పరిసరాలు కిక్కిరిసిపోగా వాహనాలతో పార్కింగ్ స్థలాలు నిండిపోయాయి. వీఐపీ, వీవీఐపీల పార్కింగ్ ఏరియాలు కూడా రద్దీగా మారాయి.



### జంపన్న వాగులో స్నానాలు..

వనదేవతలకు మొక్కులు చెల్లించుకోవడానికి ముందుగా జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించిన పలువురు ఒడ్డున ఉన్న కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించారు. అనంతరం జంపన్న, నాగులమ్మలకు మొక్కులు చెల్లించుకుని కాలినడకన గద్దెలకు చేరుకున్నారు. క్యాలైన్ల గుండా నిలువెత్తు బంగారాన్ని నెత్తినమోస్తూ సమ్మక్క-సారలమ్మ నామస్మరణలతో జేజేలు కొడుతూ తల్లుల గద్దెలకు చీర, సారె, పూలు, పండ్లు, కొబ్బరికాయలు, బెల్లం(బంగారం), పసుపు, కుంకుమ సమర్పించుకున్నారు. తల్లులారా చల్లగా చూడాలని, మళ్లొచ్చే జాతరకు వస్తామని భక్తులు వేడుకున్నారు. అనంతరం మేడారం పరిసరాల్లో వెలసిన తాత్కాలిక దుకాణాల్లో బొమ్మలు, వస్తువులను కొనుగోలు చేస్తూ సందడి చేశారు. అదేవిధంగా ఆనందంగా రంగులరాట్నాలు ఎక్కి కేరింతలు కొట్టారు. పరిసరాల్లోని వనంలోకి వెళ్లి చెట్లకింద వంటావార్పు చేసుకుని విందుభోజనాలు చేశారు.

### ముమ్మర ఏర్పాట్లు..

తెలంగాణ కుంభమేళా మేడారం మహా జాతర పకడ్బందీగా కొనసాగుతోంది. సమ్మక్క సారలమ్మ జాతర నిర్వహణను ప్రభుత్వం ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉండేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. సమ్మక్క సారలమ్మ జాతరను పర్యవేక్షించేందుకు ప్రభుత్వం హెల్త్, ఫ్యామిలీ వెల్ఫేర్ శాఖ సంచాలకులు ఆర్వి కర్ణన్, కార్మిక శాఖ సంచాలకులు కృష్ణ ఆదిత్య, ఖమ్మం మున్సిపల్ కమిషనర్ ఆదర్శ సురభి, రంగారెడ్డి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్, హనుమకొండ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాధిక గుప్తా లను నోడల్ అధికారులుగా నియమించారు.

### అందుబాటులో వైద్య సేవలు..

మేడారం జాతరలో వైద్య శాఖ ద్వారా అందిస్తున్న సేవలను నోడల్ అధికారులు ఆర్వి కర్ణన్, కృష్ణ ఆదిత్య గురువారం స్వయంగా పరిశీలించి భక్తులకు అవసరమైన వైద్య సహాయం అందేవిధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. జాతర సందర్భంగా భక్తులకు ఇబ్బందులు కలగకుండా మెరుగైన వైద్య సేవలు సకాలంలో అందించాలన్నారు.

జాతరలో తప్పిపోయిన భక్తులను తిరిగి వారి కుటుంబానికి చేర్చే దిశగా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో తప్పిపోయిన వ్యక్తుల ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేశారు. తాడ్వాయి సెక్టార్ అధికారి స్వర్ణలత నోడల్ అధికారిగా వ్యవహరిస్తూ ఇప్పటివరకు నమోదైన 798 మిస్సింగ్ కేసుల్లో 796 కేసులను పరిష్కరించి, తప్పిపోయిన వ్యక్తులను కుటుంబ సభ్యులకు అప్పగించారు.

### కట్టుదిట్టంగా పారిశుధ్య చర్యలు..

మేడారం మహా జాతర సందర్భంగా పారిశుధ్య చర్యలు కట్టుదిట్టంగా నిర్వహించేందుకు 4000 మంది సిబ్బందిని ఏర్పాటు చేశారు. జాతరలో పారిశుధ్య నిర్వహణకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చిన ప్రభుత్వం ఎప్పటికప్పుడు వ్యర్థాలను తొలగిస్తోంది. మేడారం పరిసరాలతో పాటు భక్తుల దర్శనానికి వెళ్లే అన్ని సెక్టార్లలో పరిశుభ్రత పాటించడం జరుగుతోంది. అమ్మవారి గద్దెల వద్ద 80 మంది శానిటేషన్ సిబ్బందితో ప్రత్యేక పారిశుధ్య చర్యలు చేపట్టినట్లు అధికారులు ప్రకటించారు. అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ గద్దెల వద్ద బెల్లం, భక్తులు సమర్పించే మొక్కలు ఎప్పటికప్పుడు తొలగిస్తున్నారు.

### ఘనంగా వనం పండుగ..

మేడారం జాతరలో బాగంగా శ్రీ సమ్మక్క తల్లి వచ్చే ముందు సంప్రదాయం ప్రకారం అమ్మవారికి గౌరవ సూచకంగా వనం పండుగ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది. ఈ పండుగ సందర్భంగా గిరిజన సంప్రదాయాలతో అడవి నుంచి వెదురు లంకను తెచ్చి గద్దెపై ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ప్రక్రియను వనం ప్రతిష్టాపన ఘట్టం అంటారు. వనం పండుగలో గిరిజన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని హారతులతో స్వాగతం పలికారు. బిందెలతో నీల్లు తెచ్చి వనం తెస్తున్న వారి పాదాలను కడిగారు.









## గుర్తు తెలియని మృతదేహం లభ్యం



**వరంగల్ వాయిస్, భీమదేవరపల్లి :** ముల్కనూర్‌లోని ఓ కాలనీలో మురుగు కాలువ పక్కన గుర్తుతెలియని మృతదేహం కలకలం రేపింది. గురువారం ఉదయం మృతదేహాన్ని గమనించిన స్థానికులు ముల్కనూర్ పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృదేహాన్ని పరిశీలించారు. ప్రమాదమా లేక ఎవరైనా హత్య చేసి వెళ్లారా? అన్న కోణంలో పోలీసులు వివరాలు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహానికి సంబంధించిన వివరాలు ఇంకా తెలియ రాలేదు

## అవకాశం వచ్చింది.. ఆశీర్వదించండి



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** ఎన్నో ఎండ్లుగా ఎదురు చూస్తున్న మానుకోట మార్కెట్ కమిటీ ఎస్టీ క్యాటగిరి రిజర్వ్ కావడంతో చైర్మన్ పదవి ఇవ్వాలని ముల్కలపల్లి గ్రామానికి చెందిన నూదర్ సింగ్ కోరుతున్నారు. తనకు ఓటు హక్కు వచ్చిన నాటి నుంచి ఏ ఎన్నికలు వచ్చిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేశానని గుర్తు చేశారు. స్వతహాగా రైతు బిడ్డైన తనకు రైతు కష్టాలు ఏంటో తెలుసని, గ్రామీణ ప్రాంత వ్యక్తైన తనకు మార్కెట్ చైర్మన్ పదవీ ఇచ్చి గ్రామీణ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు మనోధైర్యం కల్పించాలన్నారు. ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రాంచంద్రు నాయక్ ఈ విషయంపై దృష్టి సారించాలని కోరారు.

## రిటైర్డ్ రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ డైరీ ఆవిష్కరణ



**వరంగల్ వాయిస్, కాజీపేట :** వరంగల్ పశ్చిమ నియోజకవర్గం ప్రజా భవన్ లో నేడు రిటైర్డ్ రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ కాజీపేట బ్రాంచ్ డైరీని గురువారం వరంగల్ పశ్చిమ శాసన సభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డి ఆవిష్కరించారు.తన గెలుపుకు సహాయ సహకారాలు అందించి విజయానాకి కృషి చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కాజీపేట రైల్వే ఉద్యోగస్తులకు, రిటైర్డ్ ఉద్యోగస్తులకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటానని తెలిపారు. అదేవిధంగా రైల్వే సమస్యలు, రిటైర్డ్ ఉద్యోగులకు ఏమైనా సమస్యలు ఉంటే సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ కాజీపేట అధ్యక్షుడు కృష్ణమూర్తి, వర్కింగ్ ప్రెసిడెంట్ నగేశ్, కార్యదర్శి సుధాకర్, కోశాధికారి చంద్ర మోహన్ , అసోషియేషన్ సభ్యులు మాజీ కార్పొరేటర్ రావుల సదానందం, జిల్లా అధికార ప్రతినిధి మహమ్మద్ అంకుష్ తదితరులు పాల్గొన్నారు.

## హమీద్ పాషాకు డాక్టరేట్



**వరంగల్ వాయిస్, చెన్నారావు పేట :** జయముఖి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నలాజికల్ సైన్సెస్ అటానమస్ కాలేజ్ , జయముఖి ఇంజినీరింగ్ కళాశాల ఈసీఈ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ అండ్ హెడ్ ఎండీ హమీద్ పాషా గురువారం డాక్టరేట్ అందుకున్నారు. ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగంలో డిజైన్ ఆఫ్ డిస్టిన్క్ట్ బేస్డ్ కంటెంట్ అడ్రస్సబుల్ మెమొరీ యూసింగ్ డబుల్ గేట్ మొస్ఫెట్ అంశంపై అతను సమర్పించిన సిద్ధాంత గ్రంథానికి డాక్టరేట్ వచ్చిందని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వి జానకి తెలిపారు. బెంగళూరుకి చెందిన విశ్వేశ్వరయ్య టెక్నాలజికల్ యూనివర్సిటీ ఈసీ విభాగానికి చెందిన ప్రొఫెసర్ డాక్టర్ హాదీమని హెచ్ సీ పర్యవేక్షణ లో పీహెచ్ డీ పూర్తి చేశారని, కళాశాల ట్రెజరర్ శంకర్ రెడ్డి పత్రికా ప్రకటన ద్వారా తెలిపి డాక్టరేట్ పొందిన హమీద్ పాషాను కలశాల యాజమాన్యం తరపున అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ వి జానకి, కళాశాల యాజమాన్యం శంకర్ రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ పి శ్రీనివాస్ రావు, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు పాల్గొని హమీద్ పాషాకు అభినందనలు తెలిపారు.

# యువ రైతును కాల్చి చంపిన కేంద్రం

### మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పీక కిరణ్



**వరంగల్ వాయిస్, కాటారం :** యువరైతును కాల్చి చంపిన కేంద్ర ప్రభుత్వ చర్య హేయమైనదని ఉత్తర తెలంగాణ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పీక కిరణ్ అన్నారు. కాటారంలో పత్రికా విలేకరుల సమావేశంలో ఉత్తర తెలంగాణ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పీక కిరణ్ మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తూ, గిట్టుబాటు ధరలకు చట్ట బద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. స్వామి నాథన్ కమిషన్ సూచనలు అమలు చేయాలని కోరారు. లకీంపూర్, ఘటనకు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఢిల్లీలో ఆందోళన చేస్తున్న రైతులపై, పైశాచిక దాడులు చేస్తూ పంజాబ్, హర్యానా పోలీసులు కాల్పులు జరిపి, 24 ఏండ్ల యువ రైతును పొట్టన పెట్టుకున్నారని ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వం, ఫాసిస్ట్ విధానాన్ని ఉత్తర తెలంగాణ మాల మహానాడు తీవ్రంగా ఖండిస్తుందన్నారు. రైతు ప్రభుత్వం అని చెప్పి, రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కేంద్ర బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పదేళ్లు దాటినా ఇచ్చిన హామీలను అమలు అమలు చేయడం లేదని విరుచుకుపడ్డారు. హర్యానా, పంజాబ్, రాష్ట్రాల రైతులు, గతంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ, ఢిల్లీలో ఆందోళన వ్యక్తం చేస్తున్నారని గుర్తు చేశారు.నిన్న, హర్యానా పంజాబ్, బార్డర్ లో, హర్యానా పోలీసులు కాల్పులు జరిపి, 24 సంవత్సరాల యువ రైతు శుభ కరణ్ ను, పొట్టన పెట్టుకున్న ఘనత బిజెపి మతతత్వ, ఫాసిస్ట్ దాడులకు నిదర్శనమని అన్నారు. పోలీసులు జరిపిన కాల్పుల్లో మరణించిన రైతు కుటుంబానికి, నష్ట పరిహారం, చెల్లించి, వారి కుటుంబాన్ని ఆదుకోవాలని, ఉత్తర తెలంగాణ మాల మహానాడు రాష్ట్ర కమిటీ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తుంది. ఈ కార్యక్రమంలో ఉత్తర తెలంగాణ మాల మహానాడు నాయకులు బోడ బాపు, వావిళ్ల రమేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## సంఘ సభ్యులకు అవగాహన శిబిరాలు



**వరంగల్ వాయిస్, భీమదేవరపల్లి :** సహకారం ద్వారా సమృద్ధి అనే కేంద్ర ప్రభుత్వ నినాదానికి అనుగుణంగా సహకార సంఘ సభ్యులలో సంఘ నిర్వహణ పట్ల, నిబంధనల గురించి, వ్యాపార అభివృద్ధిలో వారి భాగ్యస్వామ్యం గురించి అవగాహన పెంచుటలో భాగంగా ములుకనూరు సహకార గ్రామీణ పరపతి, మార్కెటింగ్ సొసైటి ఆవరణలో అవగాహన శిబిరం ఈ నెల 15 నుంచి 23 వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇప్పటి వరకు 783మంది సంఘ సభ్యులు పాల్గొనడం జరిగిందని తెలిపారు. సభ్యులలో అవగాహన అనే అంశం వారిలో బాధ్యతల పట్ల గౌరవ భావం కలిగి సంఘం భవిష్యత్తు మరింత బలోపేతం కావడానికి సంఘ మేనేజ్ మెంట్ కు సహకరించడానికి దోహద పడుతుందని డా.శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా వివిధ అంశాలపై అవగాహన కల్పించడానికి డాక్టర్ యస్.యల్.యన్ టి శ్రీనివాస్, రాష్ట్ర సమన్వయకర్త, సహకార నిర్వహణ సంస్థ నుంచి రావడం జరిగింది. సహకార సంఘ నిర్వహణలో ములుకనూరు సహకార సంఘం భారత దేశంలోనే రైతులకు అన్ని రకాల సేవలు అందించే ఒక గొప్ప సంస్థగా, ఆదర్శప్రాయంగా పనిచేస్తున్నదని డా.శ్రీనివాస్ అన్నారు.

## సమాచార హక్కు చట్టం పోస్టర్ అవిష్కరణ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అవగాహన సదస్సు పోస్టర్ ను గురువారం హనుమకొండలో వరంగల్ కాంగ్రెస్ ఎంపీ అస్పిరెంట్ డాక్టర్ పెరుమండ్ల రామకృష్ణ అవిష్కరించారు. అనంతరం డాక్టర్ పెరుమండ్ల రామకృష్ణ మాట్లాడుతూ సామాన్య ప్రజలకు సైతం ప్రభుత్వం పారదర్శకంగా ఉండాలని ప్రభుత్వంలో జరుగుతున్న విషయాలు ప్రజలకు తెలియాలని, కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టం ఆర్టీఐ (రైట్ టు ఇన్ఫర్మేషన్ ఆక్ట్). ఈ చట్టం ద్వారా ప్రజలకు ప్రభుత్వ శాఖలలో జరుగుతున్న పనులు, వారి పూర్తి సమాచారం మనకు ఈ చట్టం ద్వారా ప్రజలకు అందుబాటులోకి తిసుకు వచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీ దని వారు అన్నారు. ఈ కార్యక్రమం లో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంటి ముదిరాజ్, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు స్రవంతి, వరంగల్ జిల్లా కన్వీనర్ నామిండ్ల హరీష్, అక్కెల్లి పవన్ కళ్యాణ్ పాల్గొన్నారు.

# పల్లెల్లో అభివృద్ధి పనులకు పెద్దపీట

### ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** పల్లెలను గిరిజన తండాలను ప్రజల అవసరాల మేరకు అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు అమలు చేయనున్నట్లు పాలకుర్తి శాసనసభ సభ్యురాలు మామిడాల యశస్విని రెడ్డి తెలిపారు. గురువారం తొర్రూరు మండలంలో ఎంజీఎన్ఆర్ ఈజీఎస్ నిధులతో కంఠాయపాలెం గ్రామంలో 15లక్షలతో నూతన సీసీ రోడ్డు పనులను, టిక్యా తండా గ్రామంలో 20లక్షలతో నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణం, 5లక్షలతో సీసీ రోడ్డు పనులకు , పెద్దామంగ్యా తండా హ్యాబిటేషన్ చిన్నమంగ తండాలో 5లక్షలతో నూతన సీసీ రోడ్డు పనులకు, భోజ్య తండాలో 5 లక్షలతో సీసీ రోడ్ల పనుల నిర్మాణాలకు కొబ్బరికాయలు కొట్టి ఏర్పాటుచేసిన శిలాఫలకాలను ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రధానంగా ప్రజల అవసరాల మేరకు ఏలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా ప్రణాళిక బద్ధంగా నియోజకవర్గంలో అభివృద్ధి పనులను ప్రారంభించనున్నట్లు, ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా నిధులు రావడం సంతోషకరమని, నూతన గ్రామ పంచాయితీ భవన నిర్మాణం, సీసీ రోడ్ల నిర్మాణం నాణ్యత ప్రమాణాలతో చేయాలని వీలైనంత త్వరగా ప్రారంభించి పూర్తయ్యేటట్లు సంబంధిత అధికారులు కాంట్రాక్టర్లు చొరవ తీసుకోవాలని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తూర్పాటి అంజయ్య, జడ్పీటీసీ శ్రీనివాస్, వైస్ ఎంపీపీ శ్యాంసుందర్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్, పీఆర్ఏఈ యుగంధర్, స్పెషల్ ఆఫీసర్ ప్రభాకర్, పంచాయతీ సెక్రటరీ మౌనిక, సీనియర్ నాయకులు నిరంజన్ రెడ్డి, తిరుపతి రెడ్డి, సుంచు సంతోష్, నరేందర్ రెడ్డి, సోమ రాజశేఖర్, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు, ప్రజలు పాల్గొన్నారు.

వరంగల్ వాయిస్ Evening Daily
గురువారం 22, ఫిబ్రవరి 2024
www.warangalvoice.net

# మేడారం జాతరలో కోయ దొరల సందడి

మేడారం సమ్మక్క సారలమ్మ మహా జాతర కు దేశం నలుమూలల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తున్నారు. జాతర సందర్భంగా మేడారం పరిసరాలు జన సందోహంతో నిండిపోయాయి. కోట్లాది మంది భక్తులు కొంగు బంగారం అయిన సమ్మక్క సారలమ్మ జాతర లో కోయ దొరలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నారు. దట్టమైన అడవులలో దొరికే అనేక రకాల వనమూలికల మొక్కలు ,వేర్లు, చెట్ల కొమ్మలను తీసుకు వచ్చి జాతరకు వచ్చే భక్తులకు విక్రయిస్తున్నారు. తాము ఆదివాసిలం అని అడవులలో జీవిస్తూ సమ్మక్క సారలమ్మల ఉపవాస దీక్ష చేపట్టి నిష్ఠతో పూజలు నిర్వహించి అన్ని రోగాలకు సంబంధించిన మూలికలను తమ పూర్వీకుల నుంచి తెలుసుకొని నేటికీ అదే కొనసాగిస్తూ ఎంతో మంది ప్రజలకు నయం చేసినట్లు చెబుతున్నారు. భక్తుల నమ్మకానికి అనుగుణంగా వారి వారి రోగాలు నయం అవుతాయని కోయ దొరలు జ్యోతిష్యంతో వారి జాతకం నిజమవుతుందనీ కొందరు భక్తులు తెలిపారు.

-వరంగల్ వాయిస్, మేడారం







## భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు



### ప్రత్యేక అధికారి కృష్ణ ఆదిత్య

**వరంగల్ వాయిస్, మేడారం :** మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ జాతరలో గురువారం ఉదయం నుంచి భక్తులు పోటెత్తారు. శ్రీ సారలమ్మ దేవత గద్దెకు వచ్చిన సందర్భంగా అమ్మ వారికి భక్తులు మొక్కులు చెల్లించుకుంటున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీసు యంత్రాంగం, దేవదాయశాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేసి గద్దెల వద్ద విధులు నిర్వహించే సిబ్బందికి హెడ్ హెల్మెట్లు సమకూర్చారు. గద్దెల వద్ద భక్తులు సమర్పించే బంగారాన్ని వెంట వెంటనే తరలిస్తూ అమ్మవారి గద్దెలను శానీటేషన్ సిబ్బందిచే శుభ్రపరుస్తున్నారు. భక్తుల రద్దీ పెరుగుతున్న నేపథ్యంలో గద్దెల ప్రాంగణంలో సింగరేణి రెస్క్యూ టీం, పోలీస్ సిబ్బంది, వైద్య సిబ్బంది, దేవాదాయశాఖ, శానిటేషన్ సిబ్బంది, మూడు షిఫ్టుల వారీగా విధులు నిర్వహిస్తూన్నారు. మేడారం జాతర ప్రత్యేక అధికారి కృష్ణ ఆదిత్య వాచ్ టవర్ పై నుంచి అమ్మ వారి గద్దెల వద్ద భక్తుల రద్దీని గమనిస్తూ వైర్ లెస్ సెట్ల ద్వారా సంబంధిత సెక్టార్ అధికారులకు తగు సూచనలు జారీ చేశారు. కమాండ్ కంట్రోల్ రూమ్, సీసీ కెమెరాల కంట్రోల్ రూమ్ ద్వారా జాతరలో నిరంతరం గమనిస్తూ ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా భక్తుల రద్దీని క్రమబద్ధీకరించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. జాతర ప్రత్యేక అధికారి కృష్ణ ఆదిత్య, వెంట ఐటీడీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ అంకిత్, అదనపు కలెక్టర్, అధికారులు ఉన్నారు.

## మేడారంలో వైద్య శిబిరం



**వరంగల్ వాయిస్, ములుగు :** జిల్లా ఆసియా ఖండంలోని అతిపెద్దదైన మేడారం జాతరకు దేశ నలుమూలల నుంచి అనేక సంఖ్యలో భక్తులు వస్తుంటారు. వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు జరిగిన ప్రభుత్వ వైద్యశాలకు రావాలని డీఎంహెచ్ఓ ట్రాక్టర్ అప్పయ్య అన్నారు.ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరం మేడారం జాతరలో చాలాచోట్ల ఏర్పాటు చేశామని, వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు జరిగినా మా వైద్య శిబిరానికి వచ్చి వైద్య పరీక్షలు చేసుకోవాలని ఆయన అన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య మందులు 108 వాహనాలు అందుబాటులో ఉన్నాయని, అలాగే నలభై అంబులెన్స్ బైకులు మేడారం చుట్టూ తిరుగుతున్నాయని, భక్తులకు మాత్రం ఎలాంటి ఇబ్బందులు లేకుండా వైద్య సేవలు అందిస్తామని వారు అన్నారు.



కాజీపేట సెయింట్ గాబ్రియేల్ స్కూల్ గ్రౌండ్ నుంచి మేడారం వెళ్లేందుకు భక్తుల సౌకర్యార్థం ఏవియేషన్ అధికారులు హెలికాప్టర్ ఏర్పాటు చేశారు.

వరంగల్ వాయిస్, హనుమకొండ :



జంపన్నవాగులో యువకుల జలాకాటలు

## ప్రత్యేక ఆకర్షణగా ఎదురు కోళ్లు



**వరంగల్ వాయిస్, మేడారం :** తెలంగాణ కుంభమేళాగా ప్రసిద్ధి గాంచిన మేడారం జాతరలో ప్రత్యేక ఆకర్షణగా ఎదురు కోళ్లు నిలుస్తున్నయి. జాతరకు తరలివచ్చిన భక్తులు అమ్మవారికి ఎత్తు బంగారం, కోళ్లు, మేకలు, గొర్రెలు ఇలాంటి మొక్కలు తీర్చుకోంటారు. ఈ క్రమంలో ఎదురు కోళ్లతో అమ్మలకు స్వాగతం పలుకుతారు. ఎదురు కోళ్లు అనేవి ఎప్పటీ నుంచో వస్తున్న ఆనవాయితీగా ప్రజల విశ్వాసం. అయితే చిలకలగుట్ట నుంచి గద్దె మీదకు వచ్చే వరకు అమ్మ వారు ఉగ్రరూపంతో ఉంటారంట, వారిని శాంతపరిచేందుకు తమ మొక్కులను అమ్మ వారికి ఎదురు చూపెడుతూ, అమ్మ వారిని శాంతపరిచే ప్రయత్నంగా కోళ్లను గాల్లోకి ఎగరేస్తూ, ఎదురుచూపెడుతూ మొక్కులు చెల్లించుకుంటున్నారు.

## భక్తులకు ఉచిత మాస్కుల పంపిణీ



**వరంగల్ వాయిస్, మేడారం :** మహా జాతరకు వచ్చే భక్తులకు దుమ్ము ధూళి వల్ల రోగాలు వ్యాపించకుండా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్ర వైద్య సేవల, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (టీఎస్ఎంఎస్ఐడీసీ) ద్వారా ఉచిత మాస్కుల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. జాతరలోని భక్తులకు రోడ్లపై ఉచితంగా మాస్కులు పంపిణీ చేస్తున్నారు. డారం జాతరకు ఇప్పటి వరకు ఉచితంగా 15లక్షల మాస్కులను తెలంగాణ రాష్ట్ర వైద్య సేవల, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ ద్వారా జాతర మెడికల్ క్యాంపులకు అందించారు. రాష్ట్ర మంత్రి ధనసరి సీతక్క జాతర ఏర్పాట్ల సమీక్ష సందర్భంలో హెల్త్ సెక్రెటరీ, క్రిస్టియాన, టీఎస్ఎంఎస్ఐడీసీ మేనేజింగ్ డైరెక్టర్ ఆర్.వి.కర్ణన్ సమక్షంలో జాతరలో పాల్గొంటున్న పారిశుధ్య సిబ్బందితో పాటు పోలీస్ శాఖ వివిధ శాఖల సిబ్బందికి ప్రజల సౌకర్యార్థం మాస్కులను ఎక్కువ మొత్తంలో సమకూర్చుకోవాలని ఆదేశించారు. వెంటనే స్పందించిన ఎండీ ఆర్.వి.కర్ణన్, టీఎస్ఎంఎస్ఐడీ అధికారులను అప్రమత్తం చేశారు. ఈ మేరకు పలువురు ఫార్మస్యూటికల్ మ్యానుఫాక్చర్లు స్వచ్ఛందంగా టీఎస్ఎంఎస్ఐడీసీకి విరాళంగా 15లక్షల మాస్కులను సెంట్రల్ మెడిసిన్ స్టోర్స్ ద్వారా జాతర వినియోగం కోసం అందించారు.

## సింగరేణి రెస్క్యూ టీం అత్యవసర సేవలు



**వరంగల్ వాయిస్, మేడారం :** తెలంగాణ కుంభ మేళా మేడారం మహా జాతరకు లక్షలాదిగా భక్తులు వారి మొక్కులు తీర్చుకోవడానికి దేశ నలు మూలల నుంచి పోటెత్తుతున్నారు. ఈ నేపథ్యంలో సమ్మక్క సారలమ్మ గద్దెల ప్రాంగణంలో భక్తులు కిక్కిరిసి పోయారు. అమ్మవార్ల దర్శనానికి వచ్చిన భక్తులతో క్యూలైన్లు నిండిపోయాయి. క్యూలైన్లలో, గద్దెల ప్రాంగణంలో అస్వస్థతకు గురైన భక్తులకు అత్యవసర వైద్య సేవలు అందించేందుకు 39మందితో కూడిన సింగరేణి రెస్క్యూ సిబ్బంది ద్వారా భక్తులకు అత్యవసర వైద్య సేవలు అందిస్తున్నారు. అస్వస్థతకు గురైన, గాయాల పాలైన భక్తులకు ఆక్సిజన్ రిస్టర్టర్ , కేర్ వెంట్ ల ద్వారా అత్యవసర వైద్యం అందించి స్థానిక ఆసుపత్రికి తరలిస్తున్నారు. వీరి సేవలను భక్తులు అభినందిస్తున్నారు. జాతర ప్రారంభం నుంచి ఇప్పటివరకు దాదాపు 120 మంది భక్తులకు అత్యవసర వైద్య సేవలు అందించారనీ సింగరేణి రెస్క్యూ సిబ్బంది తెలిపారు.

# 26 నుంచి ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు

## జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ హవేలి రాజు

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఈ నెల 26 నుంచి మార్చి 1 వరకు ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు సందర్భంగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో పోటీలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ హవేలి రాజు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయిలో వ్యాసరచన, నినాదం, పోస్టర్ అనే మూడు విభాగాల్లో పోటీలను పాఠశాల, ఇంటర్మీడియట్ విద్యార్థులకు నిర్వహించడం జరుగుతుందన్నారు. వ్యాసరచన విభాగంలో "నేను రాత్రికి రాత్రే మిల్లియనియర్ గా మారితే, ఆ డబ్బును ఎలా ఉపయోగిస్తాను" అనే అంశం పై 300 పదాలతో ఇంగ్లీష్, తెలుగు, హిందీ భాషల్లో రాయవచ్చని అన్నారు. నినాదం విభాగంలో "పొదుపు, చక్రవడ్డీ శక్తి" అనే అంశంపై, పోస్టర్ విభాగంలో " డిజిటల్, సైబర్ పరిశుభ్రత" అనే అంశంపై చేతితో గానీ, డిజిటల్ గా గానీ వేయవచ్చన్నారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న 10 నుంచి 25 ఏండ్ల మధ్య వయస్సు గల విద్యార్థులు అందరూ ఈ పోటీలో పాల్గొనవచ్చని తెలిపారు. విద్యార్థి పేరు, పాఠశాల లేదా కళాశాల పేరు, ప్రభుత్వ లేదా ప్రైవేట్, వయస్సు, ఫోన్ నంబర్ తప్పనిసరిగా దరఖాస్తులో పేర్కొనాలని సూచించారు. జిల్లా స్థాయిలో ఈ మూడు పోటీలలో విజేతలకు బహుమతి, సర్టిఫికేట్ ప్రధానంతో పాటు రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత పొందుతారని తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే విద్యార్థులు ఈ నెల 22 సాయంత్రం 5 గంటల లోగా జిల్లా లీడ్ బ్యాంక్ ఆఫీస్ చేరే విధంగా పోస్ట్ లేదా ఈమెయిల్ ద్వారా వ్యాసం, నినాదం, పోర్టర్ లను పంపించాలని సూచించారు. లీడ్ బ్యాంక్ కార్యాలయం, వరంగల్ జిల్లా, C/0.NRR కాంగ్రెస్ భవన్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, హనుమకొండ శాఖ, హనుమకొండ జిల్లా, 5006001 గల చిరునామాకు, లేదా ఈమెయిల్ ID. ldmwglrur-al@gmail.comకు పంపవచ్చని తెలిపారు.

# అమరదామంలో పారిశుధ్య చర్యలు చేపట్టాలి



**వరంగల్ వాయిస్, పరకాల :** పరకాల మునిసిపాలిటీకి నూతన కమిషనర్ గా విధులు చేపట్టిన నరసింహను గురువారం వయోవృద్ధుల సంక్షేమ సంఘం పరకాల సభ్యుడు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు పరకాల చారిత్రక పర్యాటక స్థలమైన అమరధామంలో ఉన్న సమస్యలను విన్నవించి వినతి పత్రం సమర్పించారు. పరకాల పట్టణానికి తలమానికంగా నిలిచిన అమరధామం ఒక చారిత్రక చిహ్నమని, ఆ ప్రదేశం నిరాధారణకు గురైందని, విగ్రహాలు రంగులు వెలిసిపోయి బీటలు వాడుతున్నాయని, పునాది గోడలు పగుళ్లు చూపుతున్నాయని మునిసిపల్ కమిషనర్ కు సీనియర్ సిటిజన్స్ వినతి పత్రాన్ని సమర్పించారు. అమరధామం ఆవరణలో పారిశుధ్య చర్యలు చేపట్టాలని ఓపెన్ జిమ్ లో పాడైన పరికరాలను మరమ్మతు చేయించాలని అదేవిధంగా పరకాల మునిసిపాలిటీ నుండి నిధులు కేటాయించి అమరధామం మరమ్మతులు చేపట్టి మనకు నిలిచిన ఏకైక చారిత్రక చాన్నాన్ని పదులపరుచుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ సొసైటీ పరకాల గౌరవాధ్యక్షుడు బూసి ప్రభాకర్ రెడ్డి, అధ్యక్షుడు రేపాల నరసింహ రాములు, ప్రధాన కార్యదర్శి కోడెపాక సమ్మయ్య, కోశాధికారి ఎడ్ల సుధాకర్, సహాయ కార్యదర్శి బాణాల మొగిలయ్య, ఉపాధ్యక్షులు పోరండ్ల కైలాసం, కార్యవర్గ సభ్యులు రేగూరి రాఘవరెడ్డి, ముదురుకోళ్ల సంపత్ తదితరులుపాల్గొన్నారు.

# కాంగ్రెస్‌ను భూస్థాపితం చేస్తామనడం కిషన్ రెడ్డి అవివేకం

## టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ ను భూస్థాపితం చేస్తామని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ప్రగల్భాలు పలకడం ఆయన అవివేకానికి నిదర్శనమని టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్ అన్నారు. 2014 ఎన్నికల్లో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ, 2018ఎన్నికల్లో కేంద్రంలో అధికారంలో ఉండి కూడా ఇక్కడ ఒకే ఒక్క సీటు గెలిచింది మరిచారా అని గుర్తు చేశారు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో అధికారంలోకి వస్తామని ప్రగల్భాలు పలికిన బీజేపీ నాయకులు బొక్కా బోర్లా పడ్డారని, మళ్లీ రానున్న ఎంపీ ఎన్నికల్లో 17స్థానాల్లో గెలుస్తామని మాట్లాడటం కిషన్ రెడ్డి రాజకీయ అజ్ఞానానికి నిదర్శనం కాదా? అని సుధాకర్ గౌడ్ ప్రశ్నించారు. కాంగ్రెస్ – బీఆర్ఎస్ ఒక్కటే అని మాట్లాడుతున్న కిషన్ రెడ్డి లిక్కర్ రాణి ఎమ్మెల్సీ కవితను వదిలిపెట్టబోమని ఢిల్లీలో మీడియా సమావేశం పెట్టి హెచ్చరించిన బీజేపీ నాయకులంతా ఎందుకు మౌనంగా ఉన్నారో అందరికీ తెలుసన్నారు. రాజకీయ లబ్ది కోసం బేరసారాలతో లిక్కర్ కేసును తాత్సారం ద్చేస్తున్న విషయం జగమెరిగిన సత్యమేనని ఆయన అన్నారు.ఆరుగాలం కష్టపడి పండించిన పంటలకు మద్దతు ధర కోరుతూ ఢిల్లీలో మలిదశ ఉద్యమం చేస్తున్న రైతుల పట్ల కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఖర్కశంగా వ్యవహరిస్తున్నదని బండి సుధాకర్ గౌడ్ అన్నారు. 21ఏళ్ల శుభ్ కరణ్ సింగ్ పోలీసు కాల్పుల్లో మరణించడం బాధాకరమని, దీనికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని ఆయన డిమాండ్ చేశారు. రానున్న ఎన్నికల్లో మతతత్వ రైతు వ్యతిరేక బీజేపీకి ఓటుతో బుద్ధి చెప్పడానికి దేశ ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని బండి సుధాకర్ గౌడ్ హెచ్చరించారు.

# జోగంపల్లిలో మొక్కులు చెల్లించుకున్న ఎమ్మెల్యే జీఎస్సార్



**వరంగల్ వాయిస్, శాయంపేట :** మండలంలోని పెద్దకోటపాకాశి వారిలో జోగంపల్లి గ్రామంలో జరుగుతున్న మినీ మేడారం సమ్మక్క సారలమ్మ జాతరను గురువారం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు సందర్శించి వనదేవతలకు మొక్కులు చెల్లించుకున్నారు. జాతర ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపును సందర్శించి, జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులకు సూచించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే గండ్ర మాట్లాడుతూ జాతర ప్రాంగణంలో గదుల నిర్మాణం, ప్రహరీ గోడతో పాటు గేటుకు తన సీడీఎఫ్ నిధుల నుంచి నిధులు మంజూరు చేస్తానని, దీంతో శాశ్వతంగా నిర్మాణ పనులు పూర్తవుతాయని తెలిపారు. అదేవిధంగా శాయంపేట మండలానికి అంబులెన్స్ సౌకర్యం కూడా వారం రోజుల్లో వస్తుందని పేర్కొన్నారు. జాతర తర్వాత గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించే విధంగా చర్యలు తీసుకుంటానని తెలిపారు. ఈ సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి, అధికార ప్రతినిధి చిందం రవి, మాజీ సర్పంచ్, జాతర కమిటీ చైర్మన్ అబ్బు ప్రకాష్ రెడ్డి, నాయకులు పోలేపల్లి శ్రీనివాసరెడ్డి, తడక ఈశ్వర్, తడక కుమారస్వామి, కౌటం లక్ష్మీనారాయణ, మారపెల్లి గట్టయ్య, మారేపల్లి రాజేందర్, వరదరాజు, భాషని శంకర్, మార్కండేయ, మారేపల్లి రవీందర్, ఎండీ హైదర్, చింతల రైపాల్ పాల్గొన్నారు.

# విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలి

## మండల విద్యాశాఖాధికారి రత్నమాల



**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** మండలంలోని పలు పాఠశాలలను మండల విద్యాశాఖాధికారి రత్నమాల గురువారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్శనలో ప్రాథమిక పాఠశాలలు లంబాడి తండా, తొర్రగుట్ట తండా పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్లను, విద్యార్థుల హాజరు రిజిస్టర్లను, ఎఫ్ఎల్ఎన్ రికార్డ్స్ ను, మధ్యాహ్న భోజన రికార్డ్ లను, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని, అలాగే విద్యార్థుల హాజరు శాతం ను పెంచాలని సూచించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలని తెలిపారు. రాబోయే వార్షిక పరీక్షలకు విద్యార్థులను సంసిద్ధం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ వి.రత్నమాల, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు ఎం.పాపమ్మ, ప్రధానోపాధ్యాయులు రియాజుద్దీన్, శ్రీహరి, సీఆర్పీ స్వామి ,మెసెంజర్ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా కంఠాత్మకూరు జాతర



**వరంగల్ వాయిస్, నడికూడ :** మండలంలోని కంఠాత్మకూరు గ్రామ శివారులో అంగరంగ వైభవంగా రెండేళ్లకు ఒకసారి జరిగే మినీ మేడారం జాతర సమ్మక్క సారలమ్మ ఆలయ చైర్మన్ రాయుడి రాజిరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా ఏర్పాటు చేసి జాతర నిర్వహిస్తున్నారు. సమ్మక్క సారలమ్మ వనం నుంచి గద్దెల పైకి చేరడంతో ఆలయ ప్రాంగణంలో మొక్కులు చెల్లించుకోవడానికి భక్తుల రద్దీతో కిక్కిరిసిపోయింది. నిలువెత్తు బంగారంతో భక్తులు అమ్మవార్ల చెంతకు చేరి కోరిన కోరికలు తీర్చాలే తల్లి అంటూ ప్రత్యేక పూజలు నిర్వహించి కానుకలు ముట్ట చెప్పడం జరుగుతుంది. భక్తులకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా వైద్య అధికారులు పోలీసు అధికారులు పలు శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండి అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ రాయుడి రాజిరెడ్డి మాట్లాడుతూ అమ్మవార్ల ఆలయ చైర్మన్ బాధ్యతలు చేపట్టి జాతర నిర్వహించడం చాలా సంతోషకరంగా ఉందని నన్ను నమ్మి నాకు ఈ బాధ్యతలు అప్పజెప్పిన పరకాల శాసనసభ్యుడు రేవూరి ప్రకాష్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని అన్నారు. రెండేళ్లకొకసారి జరిగే ఈ మినీ మేడారం జాతర ఈ సంవత్సరం అత్యంత వైభవంగా నిర్వహించడం జరుగుతున్నదని భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.

# టీఎస్పీఎస్సీలో వర్టికల్ విధానాన్ని అమలు చేయాలి

## నిరుద్యోగ మహిళల డిమాండ్



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** టీఎస్పీఎస్సీ నిర్వహించే పోటీ పరీక్షల్లో మహిళలకు హారిజెంటల్ విద్యా విధానాన్ని తీసివేయాలని అంబేద్కర్ జంక్షన్ వద్ద విద్యార్థినిల నిరసన నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినిలు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా కోచింగ్ సెంటర్లలో వేలాది రూపాయలు ఖర్చు పెడుతూ కోచింగ్ తీసుకొని ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం టీఎస్పీఎస్సీలో హారిజెంటల్ విధానాన్ని తీసుకురావడం వల్ల మహిళలకు తీవ్ర నష్టం జరుగుతుందని వారు అన్నారు. అదేవిధంగా గత పాలకులు చేసిన తప్పిదాలను రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేస్తే నిరుద్యోగ మహిళలు సహించేది లేదని వారు హెచ్చరిక జారీ చేశారు. మహిళలను దృష్టిలో పెట్టుకొని వర్టికల్ విధానాన్ని అమలులోకి తీసుకురావాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని విన్నవించుకున్నారు. హారిజెంటల్ విధానాన్ని రద్దు చేయకుండా టీఎస్పీఎస్సీ పరీక్షలు నిర్వహిస్తే రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగ మహిళలను ఐక్యం చేసి పోరాటాలు ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మమత, అనూష, స్వాతి, అనిత, వసంత, కవిత తదితరులు పాల్గొన్నారు.



# మేడారంలో జనహారం













## ఎమ్మెల్యే నాగరాజుకు వినతి పత్రం అందజేత



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ప్రైవేట్ పాఠశాలల సంఘం (వడుప్సా) వరంగల్ జోన్ అధ్యక్షుడు బొల్లం కనకయ్య ఆధ్వర్యంలో వడుప్సా వరంగల్ జిల్లా అధ్యక్షుడు చల్లా నాగార్జున రెడ్డితో కలిసి వడుప్సా ప్రతినిధి బృందం గురువారం నగరంలోని 3వ డివిజన్ పైడిపల్లిలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజును కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ప్రైవేట్ పాఠశాలలు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించి వివరించారు. వీటిలో ప్రధాన సమస్యలైనా ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలలకు శాశ్వత ప్రభుత్వ గుర్తింపు ఇచ్చుట, పదో తరగతి పరీక్షల రుసుం ఆన్లైన్ ద్వారా చెల్లించుటకు అనుమతి, కమర్షియల్ క్యాటగిరీలో ఉన్న కరెంటు మీటర్లు డొమెస్టిక్ మీటర్లుగా మార్చుట, ట్రేడ్ లైసెన్స్, ప్రొఫెషనల్ టాక్స్ ల నుంచి మినహాయింపు వంటి పలు సమస్యలను వినతి పత్రం ద్వారా తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో వడుప్సా వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బాశెట్టి వెంకటేశ్వర్లు, కోశాధికారి దండాపంతుల రాంమ్మూర్తి, ఉపాధ్యక్షులు వంగల రాధాకృష్ణ, జాయింట్ సెక్రటరీ యాద విద్యాసాగర్, వరంగల్ జోన్ కార్యదర్శి జన్ను విలియం, జిల్లా ప్రెస్ అండ్ మీడియా కన్వీనర్ పంచకం నర్సయ్య, స్పోర్ట్స్ కన్వీనర్ జన్ను సంజీవ, వరంగల్ జోన్ జాయింట్ సెక్రెటరీ ఎండీ నసీరుద్దీన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎండి ఉస్మాన్ అలీ, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ కన్వీనర్ ఎండీ ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

## కష్టపడితే ఉన్నత శిఖరాలకు చేరొచ్చు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** క్రీడాకారులు తాను ఎంచుకున్న క్రీడా పట్ల అంకితభావం, కష్టపడే మనస్తత్వం, సాధించాలనే పట్టుదల కలిగి ఉన్నప్పుడు క్రీడల్లో ఉన్నత శిఖరాలను అదిరోహించగలరని హనుమకొండ డీఎంహెచ్ఓ డాక్టర్ బి.సాంబశివరావు అన్నారు. మంగళవారం హనుమకొండలోని సెయింట్ పీటర్స్ విద్యాసంస్థల గ్రౌండ్ లో ఉమ్మడి వరంగల్ జిల్లా అండర్ -14 క్రికెట్ సెలక్షన్స్ జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన హనుమకొండ డీఎంహెచ్ఓ డాక్టర్ బి.సాంబశివరావు మాట్లాడుతూ నేడు జరుగుతున్న అండర్- 14 క్రికెట్ సెలెక్షన్ లో ఎన్నికైన క్రికెట్ క్రీడాకారులు ఈనెల 26న మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్లలో జరుగు రాష్ట్రస్థాయి అండర్-14 క్రికెట్ సెలక్షన్ పోటీలలో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సెయింట్ పీటర్స్ విద్యాసంస్థల కరస్పాండెంట్ నారాయణరెడ్డి, క్రికెట్ అసోసియేషన్ వరంగల్ ఉమ్మడి జిల్లా మాజీ జనరల్ సెక్రటరీ ఉదయభాను రావు, మాజీ క్రికెట్ ప్లేయర్ రిటైర్డ్ ప్రిన్సిపాల్ కోదండపాణి, సీనియర్ క్రికెట్ క్రీడాకారుడు బండారి ప్రభాకర్, డీఎస్ఏ హనుమకొండ క్రికెట్ కోచ్ మహమ్మద్ అఫ్జల్, కాకతీయ క్రికెట్ అకాడమీ కోచ్ అస్లాం, మాజీ క్రికెట్ ప్లేయర్ మట్టెడ కుమార్, సీనియర్ క్రీడాకారుడు మజార్, డీఎస్ఏ వరంగల్ క్రికెట్ కోచ్ సుమన్, చైతన్య క్రికెట్ అకాడమీ కోచ్ చైతన్య, పీఈటీ శంకర్, అరుణ్, తదితరులు పాల్గొన్నారు.



# డాన్ 3 లో కియారా


రామ్ చరణ్ తో 'గేమ్ చెంజర్' సినిమా చేస్తున్న బాలీవుడ్ నటి కియారా అద్వానీ ఇప్పుడు మరో పెద్ద ఛాన్స్ కొట్టేసింది. దర్శకుడు ఫర్హాన్ అక్తర్ తీయబోయే 'డాన్ 3' సినిమాలో కియారా అద్వానీ చేస్తున్నట్టుగా అధికారికంగా ప్రకటన వచ్చింది. ఇందులో రణవీర్ సింగ్ కథానాయకుడిగా నటిస్తుండగా, అతనికి జోడీగా కియారా అద్వానీ చేస్తున్నట్టుగా చిత్ర నిర్వాహకులు ప్రకటించారు. ఇది ఇంతకు ముందు తీసిన 'డాన్' సినిమాకి రెండో సీక్వెల్ గా రావటం విశేషం. దర్శకుడు ఫర్హాన్ అక్తర్ సామాజిక మాధ్యమం ద్వారా ఈ విషయాన్ని చెపుతూ, మా డాన్ యూనివర్స్‌కి స్వాగతం అంటూ కియారా అద్వానీ కి చెప్పారు. కియారా మొదటిసారిగా రణవీర్‌సింగ్‌తో ఈ సినిమాలో నటిస్తున్నారు, ఇంతకు ముందు ఆమె రణవీర్ సింగ్ తో చెయ్యలేదు. ఇంతకు ముందు వచ్చిన రెండు సినిమాలలో షా రుఖ్ ఖాన్, ప్రియాంక చోప్రా నటించారు, ఇప్పుడు రణవీర్ సింగ్ ఈ మూడో సినిమాలో కథానాయకుడిగా నటిస్తున్నారు.ఇది ఒక యాక్షన్ సినిమాగా తెరకెక్కనుందని అంటున్నారు, ఇందులో కియారా అద్వానీ ఒక యాక్షన్ పాత్రలో కనిపించ నున్నారని తెలుస్తోంది. ఇదిలా ఉండగా, కియారా ఇంకో యాక్షన్ సినిమాలో కూడా నటిస్తున్నారు. హృతిక్ రోషన్, జూనియర్ ఎన్టీఆర్ కలిపి నటిస్తున్న 'వార్ 2'లో కూడా కియారా అద్వానీ కథానాయికగా నటిస్తోంది. ఇంతవరకు యాక్షన్ పాత్రలు చెయ్యని కియారా ఇప్పుడు ఈ 'డాన్ 3', 'వార్ 2' లతో, యాక్షన్ జానర్‌లో కూడా తన ప్రతిభ చూపించుకోవడానికే అవకాశం దక్కింది. అలాగే తెలుగులో 'గేమ్ చెంజర్' లో రామ్ చరణ్ పక్కన నటిస్తోంది. దీనికి శంకర్ దర్శకుడు. ఈ సినిమా తెలుగుతో పాటు అన్ని భాషల్లో విడుదలవుతోంది.




# విరుష్క దంపతుల కుమారుడు అకాయ్

## ఆశీర్వాదం కావాలంటూ పోస్ట్

సామాజిక మాధ్యమాల్లో 'అకాయ్' అనే ఈ పేరు వైరల్ అవుతోంది. ఇది ఎవరి పేరో కాదు, ప్రముఖ క్రికెట్ ఆటగాడు విరాట్ కోహ్లి, బాలీవుడ్ నటి అనుష్క శర్మ దంపతులకు పుట్టిన కుమారుడి పేరు 'అకాయ్' అని పేరు పెట్టారు. వారిద్దరికీ ఇది రెండవ సంతానం, ఇంతకు ముందు వారికీ ఒక పాప, ఆమె పేరు వామిక. తమకి ఫిబ్రవరి 15న బాబు పుట్టాడని, అతనికి అకాయ్ అని పేరు పెట్టామని, ఆ బాబుకి అందరి ఆశీర్వాదాలు కావాలని సామాజిక మాధ్యమం ద్వారా వారిద్దరూ చెప్పారు. అయితే తమ ప్రైవేట్ లైఫ్ కి ఎవరూ భంగం కలిగించకూడదు అని కూడా ఈ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఇంతకీ అకాయ్ అంటే అర్థం ఏమిటి అనేది చాలామందికి కలిగే ప్రశ్న. ఎవరికీ వారు ఆ పదానికి అర్థం ఏమిటనేది వెతుకుతూనే వున్నారు. కొందరు అకాయ్ అంటే శరీరంలేనివాడు అని అర్థం వస్తుందని అంటున్నారు. అలాగే టర్కీ భాషలో 'అకాయ్' అంటే ప్రకాశించే చంద్రుడు అని కూడా అర్థం ఉందని అంటున్నారు. అందుకే తమ కుమారుడికి ఈ పేరు పెట్టారని కూడా కొందరి చర్చ. ఇక సంస్కృతంలో ఈ 'అకాయ్' అంటే అమరుడు, చిరంజీవి అని కూడా అర్థం వుంది అని అంటున్నారు. అకాయ్ అంటే అపరిమిత శక్తి అని కూడా ఒక అర్థం వుంది అంటున్నారు. అలాగే అకాయ్ పేరులో అనుష్కాలోని 'అ', కోహ్లి నుంచి 'క' తీసుకున్నారు అని కూడా ఒక వాదన వినిపిస్తోంది. అయితే 2021లో వీరికి పుట్టిన పాపకి వామిక అని పేరు పెట్టారు, ఆ పేరుకి అర్థం దుర్గామాత అని. ఇప్పుడు 2024లో అకాయ్ పుట్టాడు, అర్థం అందరూ వెతుకుతున్నారు. కానీ ఈ పేరు తామెందుకు పెట్టామో వారే తరువాత వివరణ ఇస్తారేమో చూడాలి. అనుష్క, విరాట్ ల వివాహం 2017లో జరిగింది.





# పాత జ్ఞాపకాలు అమోఘం

## బికినీ ఫోటోలను విడుదల చేసిన ఇలియానా

గోవా బ్యూటీ ఇలియానాకు బీచ్ అన్నా, బాత్ టబ్ అన్నా ప్రాణం. కుదిరితే బీచ్ దగ్గర విహరిస్తుంటుంది. లేదా ఇంట్లో ఉన్న బాత్ టబ్‌నే బీచ్ గా భావిస్తూ నీటితో ఆడుతుంటుంది. కెరీర్ బిగినింగ్ నుంచి జీరో సైజ్ బాడీని మెయినటెన్ చేస్తున్న కథానాయిక ఈమె. గతేడాది ఆగస్ట్ ఒకటో తేదీని ఆమె పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. ప్రస్తుతం అమ్మతనాన్ని ఆస్వాదిస్తోంది. తాజాగా ఇలియానా పోస్ట్ చేసిన ఫొటోలు నెట్టింట వైరల్ అవుతోంది. ఆమె గర్భవతిగా ఉన్న సమయంలో బికినీ ధరించి బాత్రూమ్‌లో దిగిన ఫొటో ఒకటి ఇన్స్టాలో షేర్ చేసింది. ఈ మిర్రర్ సెల్ఫీ బ్లాక్ అండ్ వైట్‌లో ఉండటం విశేషం. బ్లాక్ బికినీలో ఓ చేత్తో తన బేబీ బంప్‌ను చూపిస్తూ సెల్ఫీ దిగింది. 'ఏడాది కిందట. నాలుగు నెలల ప్రెగ్నెంట్‌గా ఉన్న సమయంలో ఇలా' అనే క్యాప్షన్‌తో ఇలియానా ఈ ఫొటో షేర్ చేసింది. ప్రస్తుతం ఈ ఫోటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. ప్రస్తుతం తన పార్ట్‌నర్‌తో అమెరికాలో ఉన్న ఆమె గర్భవతిగా ఉన్నప్పటి ఫొటోలు చూసుకుంటూ ఆ జ్ఞాపకాలను నెమరువేసుకుంటోంది. ఆమె ఈ మధ్య తన పార్ట్‌నర్ మైఖేల్ డోలాన్‌తో కలిసి వాలెంటైన్స్ డే సెలబ్రేట్ చేసుకుంది. ప్రస్తుతం ఇలియానా హిందీలో రెండు చిత్రాల్లో నటిస్తోంది.



# అవార్డ్ అంటే ఎంతో ఇష్టం

దాదా సాహెబ్ ఫాల్కే ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఉత్తమ నటుడిగా అవార్డు అందుకున్నందుకు చాలా సంతోషంగా ఉంది.. ఈ అవార్డ్ అంటే నాకు ఎంతో ఇష్టమని బాలీవుడ్ బాద్‌షా షారుక్ ఖాన్ అన్నారు దాదా సాహెబ్ ఫాల్కే ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ 2024 అవార్డుల కార్యక్రమం మంగళవారం రాత్రి ముంబైలో ఘనంగా జరిగింది. భారత సినీ ప్రముఖులతో పాటు బాలీవుడ్ సినీ ప్రముఖులు ఈ కార్యక్రమంలో సందడి చేశారు. ఇక ఈ అవార్డుల్లో గత ఏడాది విడుదలైన 'జవాన్', 'యానిమల్' చిత్రాలు పోటీ పడ్డాయి. 'జవాన్' లో నటనకు గాను ఉత్తమ నటుడిగా షారుక్ అవార్డు అందుకోగా.. ఈ సినిమాలో హీరోయిన్‌గా నటించిన నయనతార ఉత్తమ నటి అవార్డు అందుకున్నారు. ఇక 'యానిమల్' సినిమాతో కలెక్షన్ల వర్షం కురిపించిన దర్శకుడు సందీప్ రెడ్డి వంగా ఉత్తమ దర్శకుడిగా అవార్డును సొంతం చేసుకున్నారు.


VVIP PARKING AREA

# మేడారం ముచ్చట్లు

చిత్రమాలిక

























# జాతీయ హోదా అంటూ ఉండదు

**జాతీయస్థాయి గుర్తింపునకు చర్యలు**

**మేడారం పర్యటనలో కిషన్ రెడ్డి వ్యాఖ్యలు**





**వరంగల్ వాయిస్, ములుగు :** మేడారం జాతరను జాతీయ హోదా పండుగగా గుర్తించలేమని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. దీనికి జాతీయహోదా అంటూ ఏదీ లేదన్నారు. మేడారం జాతరపై కేంద్రానికి ఎలాంటి వివక్ష లేదన్నారు. ఈ జాతరను జాతీయ పండుగగా నిర్వహించాలని రాష్ట్ర నేతలు అడుగుతున్నారని, కానీ.. జాతీయ పండుగ అనే విధానం ఎక్కడా లేదని స్పష్టం చేశారు. మేడారానికి జాతీయ గుర్తింపు తీసుకురావడానికి ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. గురువారం మేడారంలో సమ్మక్క, సారలమ్మను దర్శించుకొని నిలువెత్తు బంగారం సమర్పించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ... ప్రకృతి వైపరీత్యాలు లేకుండా పాడి పంటలతో దేశమంతా సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్లుగా తెలిపారు. ములుగులో గిరిజన వర్సిటీ తాత్కాలిక క్యాంపస్‌ను ఏర్పాటు చేస్తామని, ఈ ఏడాదే ప్రవేశాలకు అనుమతిస్తామని వెల్లడించారు. ఇందులో ఎక్కువ సీట్లు స్థానిక గిరిజన బిడ్డలకే ఇస్తామన్నారు. రూ.900 కోట్లతో సమ్మక్క సారక్క కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయాన్ని నిర్మిస్తున్నామని.. వర్సిటీ భవనాలకు ప్రధాని మోదీ శంకుస్థాపన చేస్తారని చెప్పారు. ఇందుకుగాను తాత్కాలిక సిబ్బంది నియమించనున్నట్లు ఆయన ప్రకటించారు. జాకారం యూత్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ లో తాత్కాలిక భవనం, రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో యూనివర్సిటీ నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత శాశ్వత భవన నిర్మాణానికి భూమి పూజ చేస్తామని, భవన నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేస్తామన్నారు. మేడారం జాతరలో పలు అభివృద్ధి పనులకు కేంద్రం రూ.3.14కోట్లు కేటాయించిందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి సీతక్క, ఇతర ముఖ్య నేతలు పాల్గొన్నారు.






## బ్యాటరీ వాహనంలో కలెక్టర్..

మేడారం మహా జాతరలో నడవలేని స్థితిలో ఉన్న సీనియర్ సిటిజన్లను, దివ్యాంగులను సమ్మక్క సారలమ్మ గద్దెల ప్రాంగణం వరకు తీసుకువెళ్లి తిరిగి తీసుకువచ్చేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం (దేవాదాయ శాఖ) అందుబాటులోకి తీసుకొచ్చిన బ్యాటరీ కారు వినియోగాన్ని దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్ కుమార్ తో కలిసి గురువారం జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ట్రయల్ రన్ చేసి పరిశీలించారు.

**– వరంగల్ వాయిస్, మేడారం**





## మేడారంలో ఎంపీ కవిత

**వరంగల్ వాయిస్, మేడారం :** మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలోని తెలంగాణ కుంభమేళా మేడారం సమ్మక్క, సారలమ్మ తల్లులను బీఆర్ ఎస్ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షురాలు, ఎంపి మాలోత్ కవిత గురవారం దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆమె వెంట ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్, జడ్పీ చైర్ పర్సన్ బిందు, బీఆర్ ఎస్ నాయకులు కేఎస్ ఎన్ రెడ్డి దంపతులు, యల్లా మురళీధర్ రెడ్డి దంపతులు, సుధ అర్జున్ రెడ్డి, ముక్క లక్ష్మణ్ రావు తదితరులు పాల్గొన్నారు.



## స్టేషన్ ఘనపూర్‌లో ఎమ్మెల్యే కడియం

స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలోని వేలేరు మండలం పీచర, చిల్పూర్ మండలం పత్తేపూర్, స్టేషన్ ఘనపూర్ మండలం తాటికొండ, ఇప్పగూడెం గ్రామాల్లో సమ్మక్క సారలమ్మ అమ్మవార్లను స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి దర్శించుకున్నారు. అనంతరం జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమయ్యే మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయాలని ఆయా సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సమ్మక్క సారలమ్మ జాతర కమిటీ సభ్యులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కొత్తకొండ సమ్మక్కను దర్శించుకున్న మంత్రి పొన్నం

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం దామెర, భీమదేవరపల్లి మండలం ములుకనూరు, కొత్తకొండలోని సమ్మక్క, సారలమ్మలను రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గురువారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మాట్లాడుతూ గ్రామ వనదేవతలైన సమ్మక్క, సారలమ్మల దీవెనలతో రాష్ట్రం, ప్రజలు సుభిక్షంగా ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. అమ్మవార్ల దయ రాష్ట్ర ప్రజలపై ఉండాలని పూజలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. మహిమాన్విత చరిత్ర కలిగిన తల్లులను దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్య బద్ధంగా పాలన సాగుతుందన్నారు. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. రాబోయే కాలంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని, రైతులు సంతోషంగా ఉండాలని అమ్మవార్లను కోరుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వరంగల్ సెంట్రల్ జోన్ డీసీపీ ఎంఏ.భారీ,



హనుమకొండ ఆర్డీవో ఎల్.రమేష్, ఎల్కతుర్తి, భీమదేవరపల్లి తహసీల్దార్లు జగత్ సింగ్, ప్రవీణ్ కుమార్, ఎల్కతుర్తి సీఐ ప్రవీణ్ కుమార్, భీమదేవరపల్లి ఎస్సై సాయిబాబా, అధికారులు పాల్గొన్నారు.

## పోరాటాలకు స్ఫూర్తి సమ్మక్క, సారలమ్మ



స్టేషన్ ఘన్ పూర్ నియోజకవర్గ పరిధిలోని వేలేరు మండలం ఎర్రబెల్లి గ్రామంలో చిన్న బాబు ఏర్పాటు చేసిన మేడారం సమ్మక్క, సారలమ్మ దేవతలను డీసీసీబీ మాజీ చైర్మన్ జంగా రాఘవరెడ్డి గురువారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన తెలంగాణ రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో, ఉండాలని మనస్ఫూర్తిగా అమ్మవార్లను వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో వేలేర్ ఉప సర్పంచ్ సద్దాం హుస్సేన్, ఎంపీటీసీ జల్తరి సంపత్, జోడుముతుల సంపత్, తిరుపతి రెడ్డి, వార్డ్ మెంబర్ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com